بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 05.04.2019 (Telugu)**

# ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బద్రి అనుచరుల సద్గుణముల ఆసక్తికర ప్రస్తావన

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 05.04.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

నేడు నేను ప్రస్తావించనున్న బద్రి అనుచరులలో మొదటి అనుచరుని పేరు హజ్రత్ ఖిరాష్ బిన్ సిమ అన్సారి. వీరు ఖజ్రజ్‌లోని బనూ హాషిమ్ వర్గమునకు చెందినవారు. వీరు బదర్, ఉహద్ యుద్ధములో పాల్గొన్నారు. ఉహద్ రోజున వీరికి పది గాయాలైనవి. వీరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుభవజ్ఞులైన విల్లుకారులలో ఒకరిగా పరిగణించబడేవారు. బదర్ యుద్ధములో నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అల్లుడైన అబుల్ ఆస్‌ను హజ్రత్ ఖిరాష్ బంధించిరి.

రెండవ అనుచరులు హజ్రత్ ఉబైద్ బిన్ తయ్యహాన్ యున్నారు. బైఅతె అఖ్బలో పాల్గొన్న 70 మంది అన్సార్‌లలో హజ్రత్ ఉబైద్ కూడ ఒకరు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వీరిని, హజ్రత్ మసూద్ బిన్ రబీని పరస్పరం సోదరులుగా చేసిరి. వీరు తమ సోదరుడు హజ్రత్ అబుల్ హైసమ్‌తో కలిసి బదర్ యుద్ధములో పాల్గొనిరి. వీరు ఉహద్ యుద్ధములో అమరులైరి.

ఇంకా ప్రస్తావించబడనున్న అనుచరుని పేరు హజ్రత్ అబూ హన్న మాలిక్ బిన్ అమ్ర్. వీరి ఉర్ఫ్ అబూహన్న కాగా మాలిక్ బిన్ అమర్ వీరి పేరు. ముహమ్మద్ బిన్ అమ్ర్ వాఖిదీ వీరిని బద్రీ అనుచరులలో చేర్చినారు.

ఇంకా ప్రస్తావించబడనున్న అనుచరుని పేరు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ సాలబ. అబూ ముహమ్మద్ వీరి ఉర్ఫ్ కాగా వీరి తండ్రి పేరు హజ్రత్ జైద్ బిన్ సాలబ. వీరు కూడ అనుచరులుగానే యుండిరి. వీరు అన్సార్‌లోని ఖజ్రజ్ తెగకు చెందిన బనూహాషిమ్‌నకు చెందినవారు. బైఅతె అఖ్బలో పాల్గొన్న 70 మంది అన్సార్‌లలో హజ్రత్ ఉబైద్ కూడ ఒకరు. బదర్, ఉహద్, ఖందక్ యుద్ధములతో పాటు ఇతర యుద్ధములన్నిటిలో ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొన్నారు. మక్కా విజయము సందర్భమున బనూ హారిస్ బిన్ ఖజ్రజ్ పతాకము వీరి చేతిలో యుండెను. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్‌నకు ఇస్లాం రాక ముందే అరబ్బీ వ్రాయడం వచ్చేది. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ అయిన ఈ అనుచరునికి స్వప్నములో అజాన్ పదాలు తెలుపబడెను. వీరు ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయములు తెలిపిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ స్వప్నములో చూచిన పదాలతో అజాన్ ఇవ్వాలని వారు సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ బిలాల్‌ను ఆదేశించిరి. ఈ సంఘటన మస్జిద్ నబ్వీ నిర్మాణము తర్వాత హిజ్రి ఒకటవ సం॥లో సంభవించినది. దీని వివరాలిట్లు గలవు. హజ్రత్ అబూ ఉమైర్ బిన్ అనస్ తమ చిన్నానల ద్వారా ఇట్లు ఉల్లేఖించిరి. నమాజ్ కొరకు ప్రజలను ఎలా సమావేశపర్చాలని నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆలోచించిరి. నమాజ్ సమయమున ఒక పతాకము ఎగురవేయవలెను, తద్వారా ప్రజలు దానిని చూచినప్పుడు ఇతరులకు తెలుపుతారని వారికి సలహా ఇవ్వబడెను. కాని ఈ సలహా వారు సల్లల్లాహు అలైహి వసల్లంనకు నచ్చలేదు. శంఖారావం (నర్సింగా) గురించి కూడ వారికి తెలుపబడెను. ఇది యూదుల ఆచారమని తెలుపుచు దానిని కూడ వారు నచ్చలేదు. అనంతరం వారికి బాకా (నాఖూస్) ఊదుట గురించి చెప్పబడెను. కాని ఇది క్రైస్తవుల పద్ధతి అని చెప్పి వారికి ఇది కూడ నచ్చలేదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం విచారము వలన హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్‌నకు కూడ చింత కలిగెను. వారు తమ ఇంటికి చేరుకున్న తర్వాత దుఆ చేశారు. అప్పుడు వారికి స్వప్నములో అజాన్ చూపబడెను. వారిట్లు తెలిపిరి. స్వప్నములో నేనొక వ్యక్తిని చూచితిని. అతని చేతిలో బాకా యుండెను. ఓ దైవ దాసుడా! నీవు ఈ బాకాను విక్రయిస్తావా? అని అడిగితిని. దీనితో నువ్వు ఏమి చేస్తావు? అని అతడు నన్ను ప్రశ్నించెను. మేము దీనితో నమాజ్ కొరకు ప్రజలను పిలుస్తాము అని నేను సమాధానమిచ్చితిని. దీని కంటే ఉత్తమమైన విషయము నేను నీకు తెలుపనా? అని అతడనెను.

తప్పక చెప్పగలవని నేను అంటిని. అనంతరం అతడు అజాన్ పదాలు చెప్పెనని హజ్రత్ అబ్దుల్లాహ్ తెలిపిరి.

اللہ اکبر اللہ اکبر۔ اللہ اکبر اللہ اکبر۔ اشھد ان لا الہ الا اللہ۔ اشھد ان لا الہ الا اللہ۔ اشھد ان محمد رسول اللہ ۔ اشھد ان محمد رسول اللہ۔ حی علی الصلوۃ۔ حی علی الصلوۃ۔ حی علی الفلاح۔ حی علی الفلاح۔ اللہ اکبر اللہ اکبر۔ لا الہ الا اللہ۔

ఈ పదాల అనువాదము కూడ చదివి వినిపిస్తానని హుజూరె అన్వర్ అనిరి. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. ఇలా నాలుగు సార్లు పలుకవలెను. అల్లాహ్ తఆలా తప్ప మరెవరు ఆరాధనకు అర్హులు కారని నేను సాక్ష్యమిచ్చుచున్నాను. ఇలా రెండు సార్లు పలుకవలెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ ప్రవక్త అని కూడ నేను సాక్ష్యమిచ్చుచున్నాను. ఈ పదాలు కూడ రెండు సార్లు పలుకవలెను. అనంతరం حی علی الصلوۃ۔ నమాజ్‌నకు రాగలరు. నమాజ్ కొరకు రాగలరు. حی علی الفلاح۔ విజయము వైపు రాగలరు. విజయము వైపు రాగలరు. వీటిని కూడ రెండు రెండు సార్లు పలుకవలెను. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. అని మరల రెండు సార్లు పలుకవలెను. చివరిగా لا الہ الا اللہ۔ అల్లాహ్ తప్ప మరెవరు ఆరాధనకు అర్హులు కారని పలుకవలెను.

వారింకా ఇట్లు తెలిపిరి. ఈ పదములు పలికిన తర్వాత ఆ వ్యక్తి నా కంటే కొంచెం వెనక్కి జరిగెను. నమాజ్ కొరకు నిలబడినప్పుడు మీరిట్లు అనగలరని చెప్పి అనంతరం తక్బీర్ పదాలను ఇట్లు పలికెను.

اللہ اکبر اللہ اکبر۔ اشھد ان لا الہ الا اللہ اشھد ان محمد رسول اللہ حی علی الصلوۃ
حی علی الفلاح قد قامت الصلوۃ قد قامت الصلوۃ اللہ اکبر اللہ اکبر لا الہ الا اللہ۔

వారింకా ఇట్లు తెలిపిరి. ఉదయం నేను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొని నేను చూచినది తెలిపితిని. అల్లాహ్ కోరినచో ఇది నిజమైన స్వప్న కావచ్చునని వారు సల్లల్లాహు అలైహి వసల్లం పలికిరి. నువ్వు బిలాల్ వెంట నిలబడి నువ్వు చూచిన పదాలు బిలాల్‌కు చెప్పుము. అతడు ఇదే పదాలలో అజాన్ ఇచ్చును. కావున నేను బిలాల్ వెంట నిలబడి, వారికి నేను చెప్తుండగా అదే విధంగా వారు అజాన్ ఇచ్చిరి. కథకుడు మరల ఇట్లు తెలిపెను. ఈ అజాన్ ఇచ్చినప్పుడు హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ తమ గృహములో యుండి వినిరి. వారు తమ దుప్పటిని సరి చేసుకుంటూ బయలుదేరి ఇట్లనుచు వచ్చుచుండిరి. ఓ రసూలుల్లాహ్! మిమ్ములను సత్యముతో పంపిన దైవ సాక్ష్యముగా ఇతను వినన పదాలనే నేను కూడ విన్నానని తెలిపిరి. ఇది విని సకల సంకీర్తనములు అల్లాహ్‌కే అని వారు సల్లం అనిరి. మరో కథనము ప్రకారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ పదాలను విన్నప్పుడు ఈ విధంగానే దైవవాణి అందినదని తెలిపిరి.

అజాన్ దైవ స్వప్నములో చూపబడిన హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ తమ ధనమును మొత్తం దానము చేసిరి. అప్పుడు వారి తండ్రి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు వేడుకొనిరి. ఓ రసూలుల్లాహ్! తమ జీవితమునకు ఆధారమైన తమ ధనమును అబ్దుల్లాహ్ బిన్ జైద్ దానము చేసిరి. కావున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్‌ను పిలిపించి, ఇట్లనిరి. అల్లాహ్ తఆలా నిశ్చయముగా నీవు చేసిన నీ దానమును స్వీకరించెను. అయినను నీవు వారసత్వముగా ఈ ధనమును నీ తల్లిదండ్రులకు తిరిగి ఇచ్చివేయుము.

ఒక సందర్భమున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ గోర్లను హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్‌నకు ప్రసాదము ఇచ్చిరి. దీని వివరాలిట్లు గలవు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ కుమారుడు ముహమ్మద్ ఇట్లు తెలిపిరి. వారి తండ్రి నబీ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్జతుల్ విదా సందర్భమున మినా మైదానములో మన్‌హర్ అనగా బలిదానము చేసే చోట బలిదానము సమయమున ఉపస్థితులైయుండిరి. వారితో పాటు అన్సార్‌లోని మరొకరుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బలిదానములను పంచిరి. కాని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ తో పాటు వారి వెంట వున్న అనుచరునికి కూడ ఏమియును లభించలేదు. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ కేశములు కత్తిరింపజేసిరి. వాటిని ప్రజలకు పంచి పెట్టిరి. అనంతరం తమ గోర్లను కత్తిరింపజేసిరి. వాటిని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ తో పాటు వారి వెంట వున్న అనుచరునికి ప్రసాదించిరి.

అల్లామా జర్ఖాని ఇట్లు వ్రాసిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ తమ తోటలో పని చేయుచుండగా వారి కుమారుడు వారి వద్దకు వచ్చి నబీ సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించారని సమాచారమందించెను. బదులుగా

వారిట్లనిరి. اللھم اذھب بصری حتی لا اری بعد حبیبی محمدا احدا అనగా ఓ నా అల్లాహ్! నువ్వు నా చూపును తిరిగి తీసుకో. తద్వారా నేను నా ప్రియతముడైన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను తప్ప మరెవరిని చూడకూడదు. ఇట్లనిరి. అనంతరం వారి చూపు మందగించడం మొదలయ్యెను. తుదకు వారు అంధులుగా మారిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్ అన్ని యుద్ధములలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొన్నారు. హజ్రత్ ఉస్మాన్ ఖిలాఫత్ హయాంలోని చివరి కాలములో హిజ్రి 32వ సం॥లో వీరు 64 సంవత్సరముల వయసులో మదీనాలోనే మృతి చెందిరి. వీరి జనాజ నమాజ్ (అంత్యక్రియ ప్రార్థన) హజ్రత్ ఉస్మాన్ చదివించిరి.

ఇంకా ప్రస్తావించబడనున్న అనుచరుని పేరు హజ్రత్ మఆజ్ బిన్ అమర్ బిన్ జమూహ్. వీరు బనూ ఖజ్రజ్‌లోని బనూ సల్మా శాఖకు చెందినవారు. వారు బైఅతె ఉఖ్బా సానియలో, బదర్, ఉహద్ యుద్ధములలో పాల్గొన్నారు. వీరి తండ్రి హజ్రత్ అమర్ బిన్ జమూహ్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులే. వారు ఉహద్ యుద్ధములో అమరులైరి. వీరి తల్లి పేరు హింద్ బిన్తె అమర్. హజ్రత్ మఆజ్ బైఅతె అఖ్బా సానియాలో పాల్గొనిరి. కాని వారి తండ్రి అమర్ బిన్ జమూహ్ తమ అన్యారాధన విశ్వాసాలపై చాలా గట్టిగా నిలబడిరి. సీరత్ ఇబ్నె హష్షామ్‌లో హజ్రత్ మఆజ్ తండ్రి ఇస్లాం స్వీకరణ సంఘటన ఇట్లు వ్రాసియున్నది. బైఅతె ఆఖ్బా సానియాలో పాల్గొన్న అనుచరులు మదీనా తిరిగి వచ్చిన తర్వాత చాలా చక్కగా ఇస్లాం ప్రచారము చేసినారు. వారి జాతిలో ఇప్పటికి కొందరు పెద్దలు అన్యారాధన ధర్మమునే ఆచరించుచుండిరి. వీరిలో ఒకరు అమర్ బిన్ జమూహ్ కూడ యుండిరి. అమర్ బిన్ జమూహ్ బనూ సల్మా నాయకులలో ఒకరు. వారు తమ గృహములో కలపతో ఒక విగ్రహము సిద్ధము చేసుకొని, దానిని పూజించేవారు. బైఅతె అఖ్బా సానియా తర్వాత హజ్రత్ మఆజ్ బిన్ జబల్, హజ్రత్ మఆజ్ బిన్ అమర్ బిన్ జమూహ్ రాత్రికి అమర్ బిన్ జమూహ్ విగ్రహాలయములో ప్రవేశించిరి ఆ విగ్రహమును ఎత్తుకెళ్లి, దానిని బనూ సల్మాకు చెందిన చెత్త బావిలో పడేసిరి. ఉదయం అమర్ నిద్ర లేవగా మా ఆరాధ్యదైవములతో ఎవరు ఇలా శత్రుత్వము చేసినారో వారు నాశనమగుదురు గాక! అని శపించి, అనంతరం వారు దానిని వెతికి వెతికి దొరకబట్టుకొనిరి, దానిని కడిగి, శుభ్రపరచుకొనిరి. తదుపరి ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణముగా! నీతో ఎవరు ఇలా ప్రవర్తించినారో నాకు తెలిస్తే అతణ్ణి నేను తప్పక అవమానపరుస్తాను. అలా ప్రతి రోజు రాత్రి అయిన తర్వాత వారు నిద్రకు ఉపక్రమించుకోగానే వారి కుమారులు మరల అలాగే చేసేవారు. ఒక రోజు రాత్రి వారు తమ ఖడ్గమును దాని మెడకు యాలాడదీసి, ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణముగా! నిశ్చయముగా నీతో ఇలా ఎవరు చేస్తున్నారో నాకు తెలియదు. నీలో ఏమైనా శక్తి యున్నచో నీవే అతణ్ణి నివారించుము. సాయంత్రం అయిన తర్వాత అమర్ నిద్రపోయిరి. ఆ యువకులు మరల ఆ విగ్రహమును అలాగే చేసిరి. ఉదయం అమర్ బిన్ జమూహ్ లేచిన తర్వాత తాను వుంచిన చోట ఆ విగ్రహమును పొందలేదు. అనంతరం వారు దానిని అన్వేషించిరి. ఒక కుక్క కళేబరముతో ఆ విగ్రహము కట్టి వేసి ఒక బావిలో పడేసినట్లు వారు చూచిరి. వారీ సన్నివేశము చూడగానే వాస్తవము వారికి అవగతమయ్యెను. వారి జాతి ముస్లిములు కూడ వారికి ఇస్లాం సందేశమందించిరి. అల్లాహ్ తఆలా కృపానుసారము వారు ఇస్లాం స్వీకరించిరి.

హజ్రత్ మఆజ్ బిన్ జమూహ్ అబూజహల్‌ను హతమార్చినవారిలో ఒకరు. హజ్రత్ మఆజ్ బిన్ అమర్ బిన్ జమూహ్, హజ్రత్ మఆజ్ బిన్ అఫ్రా అబూజహల్‌పై దాడి చేసి అతణ్ణి హత్య చేసిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ అబూజహల్ తల నరికి వేసిరి. హజ్రత్ అనస్ ఇట్లు ఉల్లేఖించిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బదర్ యుద్ధమున అబూజహల్ గతి ఏమైనదో ఎవరైనా చూడగలరా? అని అడిగిరి. హజ్రత్ ఇబ్నె మసూద్ వెళ్లి చూచిరి. అఫ్రా ఇద్దరు కుమారులు మఆజ్, మవూజ్ ఖడ్గముతో దాడి చేసిరి. అతడు కొన ఊపిరితో వుండెను. నువ్వు అబూజహల్‌వా? అని అబూజహల్‌ను హజ్రత్ ఇబ్నె మసూద్ ప్రశ్నించిరి. నా కంటే గొప్ప వ్యక్తిని నువ్వు ఎన్నడైనా హతమార్చినావా? అని అతడగిగెను.

హజ్రత్ సయ్యద్ జైనుల్ ఆబిదీన్ వలియుల్లాహ్ షాహ్ గారు అబూజహల్ హంతకుల గురించి గల విభేదమును పరిష్కరించుచు ఇట్లు వ్రాసిరి. కొన్ని కథనములలో అఫ్రా ఇద్దరు కుమారులు మవూజ్, మఆజ్ దాడి చేసి అబూజహల్‌ను కొన ఊపిరికి చేర్చిరి. అనంతరం హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ అతని తలను మొండెంతో విడదీసిరి. ఇమామ్ ఇబ్నె హజర్ ఒక ఆలోచనను వ్యక్తపరచిరి. అనగా మఆజ్ బిన్ అమర్, మఆజ్ బిన్ అఫ్రా తర్వాత మవూజ్ బిన్ అఫ్రా కూడ వారిపై దాడి చేసిరి. ఇందుకే మొదటి రెండు కథనములలో ఈ ఇద్దరు సోదరుల ప్రస్తావనము లభించును. రెండో కథనములో ఇద్దరు విభిన్న వ్యక్తుల ప్రస్తావన గలదు. షరహ్ ఫత్హుల్ బారీలో ఈ ముగ్గురు కూడ పాల్గొని వుండవచ్చునని వ్రాసి యున్నది.

మరో కథనములో ఇట్లు కూడ గలదు. మరణించే కంటే ముందు అబూజహల్ హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్

మసూద్‌తో ఇట్లనెను. నేను జీవితాంతం అతనికి అనగా హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు విరుద్ధంగా వున్నాను. ఇప్పటికి అతని శత్రుత్వంలో తీవ్ర స్థాయికి చేరివున్నాను. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ అతని తల నరికి, దానిని తీసుకొని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చినప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నేను అల్లాహ్ తఆలా దృష్టిలో ఇతర ప్రవక్తలందరి కంటే ఎక్కువ గౌరవము, మర్యాద కలిగి వున్నట్లే నా సమాజము కూడ అల్లాహ్ తఆలా దృష్టిలో ఇతర సమాజములన్నిటి కంటే ఎక్కువ గౌరవము, మర్యాద కలిగి వున్నది. ఇదే విధంగా ఈ సమాజపు ఫిర్‌ఔన్ కూడ ఇతర సమాజముల ఫిర్‌ఔన్‌ల కంటే ఎక్కువ కఠినుడు, వ్యతిరేకుడు. ఎందుకనగా ఫిర్‌ఔన్ మరణానికి చేరుకున్నప్పుడు అతడిట్లనెను. حَتّٰۤى اِذَاۤ اَدۡرَكَهُ الۡغَرَقُ ۙ قَالَ اٰمَنۡتُ اَنَّهٗ لَاۤ اِلٰهَ اِلَّا الَّذِىۡۤ اٰمَنَتۡ بِهٖ بَنُوۡۤا اِسۡرَآءِيۡلَ అనగా ఇస్రాయీల్ సంతతి విశ్వసించిన అల్లాహ్ తఆలా తప్ప మరెవరు ఆరాధనకు అర్హులు లేరని నేను విశ్వసించుచున్నాను. కాని ఈ సమాజపు ఫిర్‌ఔన్ శత్రుత్వము, అవిశ్వాసములో చాలా ముందున్నాడు. ఇదియే కాక ఇతర కథనములలో ఇట్లున్నది. అనగా అబూజహల్ తలను చూడగానే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. اللہ الذی لا الہ الا ھو అనగా అల్లాహ్ తఆలా తప్ప మరో ఆరాధ్య దైవము లేదు. ఇదే విధంగా వారు సల్లల్లాహు అలైహి వసల్లం మూడు సార్లు ఇట్లనిరి. الحمد للہ الذی اعز الاسلام واھلہ అనగా అన్ని రకాల సంకీర్తనమునకు అల్లాహ్ తఆలాయే అర్హుడు. అతడే ఇస్లాం, దాని విశ్వాసులకు గౌరవము ప్రసాదించెను. ఇదే విధంగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నట్లు కూడ కథనములో గలదు. నిశ్చయముగా ప్రతి జాతికి ఒక ఫిర్‌ఔన్ వుండును. ఈ జాతికి ఫిర్‌ఔన్‌గా అబూజహల్ యుండెను. అల్లాహ్ తఆలా అతణ్ణి ఎంతో ఘోరంగా హత్య చేయించెను.

హజ్రత్ మఆజ్ బిన్ అమర్ బిన్ జమూహ్ హజ్రత్ ఉస్మాన్ హయాంలో మృతి చెందిరి. హజ్రత్ ఉస్మాన్ వారి జనాజ నమాజ్ చదివించిరి. వారు జన్నతుల్ బఖీలో సమాధి చేయబడిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నట్లు హజ్రత్ అబూహురైరహ్ రజి ఉల్లేఖించిరి. మఆజ్ బిన్ అమర్ బిన్ జమూహ్ ఎంతో మంచి వ్యక్తి. అల్లాహ్ వీరిపై వేలాది కరుణలు కురపించుగాక! ఎందుకనగా వీరు అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త ప్రేమలో లీనమై అతని ప్రీతిని పొందిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నమాజ్ తర్వాత నేనొక పరోక్ష అంత్యక్రియ ప్రార్థన కూడ చదివింతును. ఇది గౌ॥ మలిక్ సుల్తాన్ హారూన్ ఖాన్ గారిది. వీరు ఇస్లామాబాద్‌లో 27 మార్చి తేదీన మృతి చెందిరి. انا للہ وانا الیہ راجعون వీరి పెద్ద కుమారులు హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ రాబె రహిమహుల్లాహు అల్లుడు కూడ. వీరి తండ్రి పేరు కర్నల్ మలిక్ సుల్తాన్ ముహమ్మద్ ఖాన్ గారు. వారు 23 సం॥ల వయసులో 1923 సం॥లో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు హస్తమున బైఅత్ చేసి, తమ కుటుంబములో ఒంటరిగా అహ్మదీ అయిరి. వారి సోదరి రాషిదహ్ సయ్యాల్ గారిట్లనిరి. నా సోదరుడైన సుల్తాన్ హారూన్ ఖాన్ అనేక విశిష్టతలు కలిగి వుండెను. అహ్మదియ్యత్ పట్ల చాలా అభిమానము కలిగి వుండేవారు. ఖిలాఫత్ కొరకు ప్రాణము త్యాగము చేయుటకు సిద్ధముగా యుండెను. మిత్రులకు నిజమైన స్నేహితుడు కాగా శత్రువులకు వణుకు పుట్టించేవారు. పేదలు, అనాథలకు సహాకారమందించేవారు. అల్లాహ్ తఆలా వారిని కరుణించి, క్షమించుగాక! వారి సంతానము కూడ వారి పుణ్యములను కొనసాగించుచు, జమాఅత్, ఖిలాఫత్‌తో అనుసంధానమై వుండేటట్లు చేయుగాక!

BOOK POST (PRINTED MATTER)

To,

............................................................

............................................................

............................................................